క్లుప్తంగా

గురజాల సబ్ జైలు తనిఖీ

గురజాల: స్థానిక సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి జి. షర్మిల శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ , 10వ అదనపు జిల్లా జడ్జి జి. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆమె జైలును సందర్శించారు. సౌకర్యాలు, వసతులు, వైద్య సేవలు, భోజనం నాణ్యత తదితర అంశాల్ని ఖైదీల్ని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీ బాష, న్యాయవాది కలివెల ప్రభుదాసు, సబ్ జైలు సూపరింటెండెంట్ సీహెచ్. సుబ్బారెడ్డి, అదాలత్ సిబ్బంది ఉన్నారు.

నేడు పొందుగలలో ఈద్గా ప్రారంభం



దాచేపల్లి : మండలంలోని పొందుగలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, సర్పంచ్ తండా బుడేసా, ఉప సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్ శనివారం తెలిపారు. పొందుగలలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఈద్గాను ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

మానసిక దివ్యాంగులపై ప్రేమ చూపించాలి



దాచేపల్లి : మానసిక దివ్యాంగులపై ప్రతి ఒక్కరూ ప్రేమను చూపించాలని ఎంఈవో ఎం. పినాకపాణి తెలిపారు. ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపురం ఫాతిమా మాత ప్రత్యేక అవసరాల కలిగిన పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఎంఈవో పినాకపాణి మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని, వారిని అన్ని విధాలుగా సంసిద్ధుల్ని చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గురజాల ఎంఈవో కాంతారావు, సిస్టర్ అమలకుమారి, కరస్పాండెంట్ మరియరాణి, సీఆర్పీ అబ్రహాం, సిస్టర్ మనీషా, జయశీల పాల్గొన్నారు.

మోదీ పాలన దేశానికే ఆదర్శం: బీజేపీ



పిడుగురాళ్ల: పట్టణంలోని పీవీఆర్ డిగ్రీ కాలేజీలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎ. సుధాకర్‌బాబు మాట్లాడుతూ మోదీ పాలన దేశానికే ఆదర్శంగా పేర్కొన్నారు. ఆయన దేశంలో ప్రతి ఒక్కరి సంక్షేమం గురించి ఆలోచించే వ్యక్తని తెలిపారు. ఆయన జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నరసింహారావు, మస్తాన్‌రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎస్టీయూ కార్యాలయం ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎస్టీయూ కార్యాలయాన్ని ఆదివారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు ప్రారంభించనున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

గురజాల : ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వైద్యురాలు పద్మావతి తెలిపారు. గురజాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది, వైద్యులు జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు కూడా వైద్య సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం ఇప్పించ లేదని యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాతూరు ప్రాంతానికి చెందిన ఆవుల వెంకట శివసాయి ద్విచక్ర వాహనం ఇప్పించాలని తండ్రితో గొడవ పడ్డాడు. ఆయన ఇప్పించక పోవడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న వెంకట శివసాయిని వైద్యశాలకు తరలించారు.

బోలో గణపతి మహరాజ్‌కు జై !



ఇందిరా నగర్ కాలనీ సెంటర్‌లో గణపతికి హారతులిస్తున్న మహిళలు



కారెంపూడి పాత ఎస్సీ కాలనీలో నగదు అలంకారంలో గణేష్ మహరాజ్

కారెంపూడి: మండలంలో గణేష్ నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. పూజా పందిళ్ల నుంచి వినాయకుడ్ని వెలుపలికి తీసి ట్రాక్టర్‌పై ఉంచి విద్యుద్దీపాల అలంకరణ, డప్పు వాయిద్యాలు, యువకుల విన్యాసాలతో వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించారు. ప్రసాదాలు పంచుతూ ఊరేగింపు కార్యక్రమాలు కొనసాగాయి.

==స్థానిక పాత ఎస్సీ కాలనీలో కన్నమదాసు యువజన సంఘం గణేష్ విగ్రహానికి లక్షలాది రూపాయల నగదుతో ఆకర్షణీయంగా అలంకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజలో పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ పాల్గొన్నారు.

✦స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లో కాపు సంఘం ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద, ఇతర చోట్ల శుక్రవారం రాత్రి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

✦ స్థానిక ఇందిరా నగర్ కాలనీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన ఊరేగింపు శనివారం రాత్రి 7.15 గంటలకు ప్రారంభమైంది. ఆ ప్రాంత మహిళలంతా తరలివచ్చి గణపతికి దివ్యహారతులిచ్చారు. వార్లు పోసి కొబ్బరి కాయలు కొట్టి, స్వామిని గ్రామోత్సవానికి సాగనంపారు. ఈ కార్యక్రమం మొత్తం కన్నుల పండువగా కొనసాగింది.

✦ ఎస్ఎస్‌పీ కాలనీలోని పురాతన వినాయక ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనోత్సవం కూడా వైభవంగా కొనసాగింది.

పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ పేమెంట్ల కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్

వెల్దుర్తి: మండలంలోని 14 సచివాలయాల్లో ఇక నుంచి డిజిటల్ పేమెంట్లు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు శనివారం కార్డుల్ని అందించినట్లు ఎంపీడీవో డి. ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ కార్డుల్ని వారికి పంపిణీ చేసినట్లు చెప్పారు. గతంలో సచివాలయాల్లో నగదు రూపంలో బిల్లులు చెల్లించేవారని, ఇక నుంచి డిజిటల్ పేమెంట్లు, కార్డుల ద్వారా స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు. లావాదేవీలు పారదర్శకంగా జరిగేందుకు సచివాలయాలకు సీఎం జగన్ ఈ అవకాశాన్ని కల్పించారని చెప్పారు. ఇంటి, నీటి పన్నులతో పాటు ఇతర బిల్లుల్ని డిజిటల్ పేమెంట్ రూపంలో చెల్లించవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అంజనేయులు

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో శనివారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శివశంకర్ కుమార్తె అనిత(20)కు గ్రామానికి చెందిన కొండ్రు ముత్తయ్యతో రెండు సంవత్సరాల కిందట వివాహమైంది. పెళ్లి జరిగిన దగ్గర నుంచి గొడవలు అవుతున్నాయి. దీంతో అనిత నెల రోజుల నుంచి పుట్టింటిలోనే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం తండ్రి ఆమెను తీసుకొని అత్తారింటికి వెళ్లగా భర్త, అత్త మామలు రానివ్వకపోడంతో గొడవ జరిగింది. దీంతో అనిత తిరిగి బ్రాహ్మణపల్లిలోని పుట్టింటికి చేరుకుంది. శనివారం సాయంత్రం అనిత తల్లిని షాపు వద్దకు పంపించి, ఆమె వచ్చేలోగా ఉరి వేసుకొని చనిపోయింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ పి.వి. ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ప్రయాణికుల రక్షణే లక్ష్యం



విద్యార్థుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

పిడుగురాళ్ల: రైల్వే ప్రయాణికుల రక్షణే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు తెలిపారు. తొలుత పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్కాలర్ స్కూల్ విద్యార్థులకు రైల్వే నిబంధనల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు మాట్లాడుతూ రైలు వెళ్లేటప్పుడు రాళ్ల వేయడం నేరమని చెప్పారు. రైలు కూడా మనదే అనే ఆలోచన ప్రజలందరికీ రావాలని ఆయన తెలిపారు. రైలుల్లో అక్రమంగా మద్యం తరలించడం, మానవ అక్రమ రవాణాపై కూడా ప్రయాణికులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

ఓట్ల మార్పులు, చేర్పులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణకుమార్

దాచేపల్లి : ఓట్ల మార్పులు, చేర్పుల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి. కరుణకుమార్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన ఉండాల్సిన ఓట్లతో పాటు పురుషులు, స్త్రీలు, యువతీ, యువకుల నమోదుపై అవగాహన కల్పించారు. 70 ఏళ్లు నిండిన ఓటర్ల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని ఆయన సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే ఓటర్లుగా నమోదు చేయాలని, చనిపోయిన వారి ఓట్లు సమగ్రంగా విచారణ చేసి తొలగించాలని ఆయన చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, ఆర్ఐ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: భర్తతో వివాదం కారణంగా భార్య గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని శనివారం కాకాని గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని గ్రామానికి చెందిన మేడంపల్లి శ్రీదేవి (41) భర్త శేషగిరికి మధ్య గత కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ శివనాగిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- చేసినా ప్రోత్సహించినా జైలు జరిమానా తప్పదు
- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి
- యడ్లపాడు-2 గ్రామ సచివాలయం సందర్శన



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న పద్మావతి, ఎంపీడీవో వై. హనుమారెడ్డి

యడ్లపాడు: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా.. జైలుశిక్ష, జరిమానా తప్పదని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తులు పద్మావతి సూచించారు. మండల కేంద్రమైన యడ్లపాడు-2 గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వై. హనుమారెడ్డి, సీడీపీవో జి.శాంతకుమారితో కలిసి శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయాల నుంచి బాలల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలపై చేస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలకు నిరక్షరాస్యతతో పాటు లింగవివక్ష ప్రధాన కారణమన్నారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదివే వయసులో బలవంతంగా జరిగే ఈ వివాహాల కారణంగా బాలికల పలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. వారికి పుట్టే బిడ్డలు కూడా మానసిక, శారీరక పరిపక్వత ఉండదని వివరించారు. తద్వారా వారి బంగారు భవిష్యత్‌ను అంధకారంగా మార్చుతున్నారన్న విషయాన్ని బాలిక తల్లిదండ్రులు, సంరక్షకులే గ్రహించాలన్నారు. బాల్య వివాహాలు చేసేవారిపై అధికారులు కఠినంగా వ్యవహరించి, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకోసం ఐసీడీఎస్, విద్య, పోలీసు, గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ అధికారులు సమిష్టిగా బాల్య వివాహాల్ని గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల సహకారంతో అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాల నిరోధం, వారి హక్కుల సంరక్షణపై ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి సచివాలయంలోనూ చైల్డ్‌లైన్లకు సంబంధించిన ఆయా అధికారుల సెల్‌నంబర్లను పోస్టర్లపై ప్రదర్శిన చేయాలని సూచించారు. వీటిపై ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ బాలల తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బాలల రక్షణ, సంరక్షణ, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అంతటా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలతో దేశంలోనే ఏపీ ఐదోస్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో బి.నిర్మలారాణి, పంచాయతీ కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థిని మృతి: ఇద్దరు విద్యార్థులకు గాయాలు

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుబ్బయ్యతోటకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ లారీ స్పేర్ పార్టుల షాపు నడుపుతుంటాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె షేక్ వాజీదా(18) గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. శనివారం తండ్రితో కలసి ద్విచక్రవాహనంపై అడ్డరోడ్డు సెంటర్ చేరుకుంది. ఈ క్రమంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు దూసుకువచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పాటు అక్కడే బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులపైకి దూసుకు రావడంతో గుంటూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న కట్టా కృష్ణ, ఏసు కుమార్ సింగ్ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన కృష్ణను గుంటూరును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ వాజీదాను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తండ్రి అబ్దుల్ రషీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ విద్యార్థి బలవన్మరణం



ధనుష్‌కుమార్ (ఫైల్)

నాదెండ్ల: దుర్వ్యసనాలు, బెట్టింగులకు బానిసైన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు యిచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జె.బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తూబాడు గ్రామానికి చెందిన దోగిపర్తి వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం కాగా మొదటి కుమారుడు నరేంద్రబాబు ఇంట్లోనే చిల్లర దుకాణం నడుపుతాడు. రెండో కుమారుడు ధనుష్‌కుమార్ (20) నరసరావుపేటలోని ఓ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నాడు. ధనుష్‌కుమార్ మిత్రులతో కలిసి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. రెండేళ్ల నుంచి అప్పులు ఇచ్చిన వారికి అధిక వడ్డీలు చెల్లిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో రెండు నెలల నుంచి వడ్డీలు చెల్లించకపోవటంతో అప్పులిచ్చిన వారు ఇంటికి వచ్చి తల్లిదండ్రులను నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురైన ధనుష్‌కుమార్ శుక్రవారం ఉదయం పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. తండ్రి దోగిపర్తి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆదివారం బంధువులకు అప్పగించనున్నారు.

అనారోగ్య సమస్యతో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన నాదెండ్ల హనుమంతరావు (37) శుక్రవారం నిమ్మతోటలోని అత్తగారింటికి వచ్చాడు. నాగసర్‌వలీ ట్యాకీస్ వద్ద ఉన్న ఓవర్‌బ్రిడ్జి పైకి ఎక్కి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని 108 సహాయంతో వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మీతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేట టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్. రాంబాబు చెప్పారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యల్ని 9959225427 నంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత అవసరం



రెంటాలలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న పీఆర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రెంటచింతల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడితే ఉపేక్షించేది లేదని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోలర్ ఏఈలు ఓరుగంటి సుధాకర్‌రెడ్డి, గుర్రం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని రెంటాల, పాలువాయి, తుమృకోట, పాలువాయిగేటు, పశర్లపాడు గ్రామాల్లో శనివారం పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రూ. 3.09 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, పాలకేంద్రాల నిర్మాణ పనుల్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నాలుగు కాలాల పాటు మన్నికతో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గుత్తేదారులు పనుల్ని చేపట్టాలని, లేనిపక్షంలో బిల్లుల్ని నిలిపి వేయనున్నట్లు చెప్పారు. పనుల నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మున్నా చంద్రశేఖర్, ఇన్‌చార్జి సర్పంచ్ చింతా సుబ్బారావు, పాశం నర్సిరెడ్డి, నాగేశ్వరరావు, పాతపాటి పిచ్చిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పిడుగురాళ్ల: యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పిడుగురాళ్లలోని కార్యాలయంలో శనివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ కాశీం పీరా, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జమాల్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా ఇప్పుడు ఉపాధ్యాయులు సౌకర్యాల్ని అనుభవిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ రాజీ లేకుండా నిరంతరం పోరాడుతోందని తెలియజేశారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా ఈ నెల 28న యూటీఎఫ్ స్వర్ణోత్సవ బైక్ ర్యాలీని నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు ప్రసాద్, అధ్యక్షులు సాంబశివరావు, ఫిరోజ్, యూటీఎఫ్ నాయకులు మరియదాసు, చంద్రశేఖర్, సత్యనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కుల, మత, పార్టీలకతీతంగా పథకాల మంజూరు



పెన్షన్ కార్డును అందజేస్తున్న సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి

వెల్దుర్తి: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తున్నట్లు సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని కండ్లకుంట సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 33 నూతన పెన్షన్ కార్డులను ఆయన పార్టీ నేత పిన్నెల్లి వెంకటేశ్వరరెడ్డితో కలసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వలంటీర్లు గడప గడపకు తిరిగి పథకాలకు అర్హుల్ని గుర్తించి, వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి వెంకట లక్ష్మారెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, తంగిరాల శివారెడ్డి, ఈడెబోయిన వెంకయ్య, నర్రావుల అయ్యన్న, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలుగు మాటపై ఆకట్టుకున్న సాహిత్య మేళా



సాహిత్య మేళలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శనివారం నెలనెలా సాహిత్య మేళ నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్య సమాలోచన కార్యక్రమంలో భాగంగా తెలుగు జాతీయాలు, సామెతలపై సాహితీ గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగు నుడికారంపై మాట్లాడారు. తెలుగు మాటల పుట్టుక, అభివృద్ధి అంశాలను వివరించారు. పాఠశాలల విద్యార్థులు తెలుగు మాటల సమాహారాన్ని వివరించి కలెక్టర్ శివశంకర్ అభినందనలు పొందారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోవా మద్యం స్వాధీనం



ఈపూరు : రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నవారిపాలెంలో 768 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రరావు శనివారం తెలిపారు. సమాచారం మేరకు ఈపూరు ఎస్ఈబీ ఎస్ఐ వీరవల్లి సైమన్ సిబ్బందితో దాడులు చేయగా, 52 కేసుల 750 ఎంఎల్ హనీ గ్రేడ్ బ్రాండీ, 2 కేసుల రాయల్ క్లాసిక్ మాల్ట్ విస్కీ, ఒక కేసు మెన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాండీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుచ్చిపాపన్నవారిపాలెంకు చెందిన చల్లా వెంకటసాయి, ముత్తనపల్లికి చెందిన గోరంట్ల లక్ష్మీనారాయణ, తంగెడుమల్లి గ్రామానికి చెందిన అద్దంకి విజయ్‌కుమార్, బాపట్ల జిల్లా జానకవరానికి చెందిన కొండేపి రాములు గోవా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మొత్తం 768 బాటిళ్లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేశామని, వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. అయితే, వినాయక నిమజ్జనాన్ని దృష్టిలో పెట్టుకొని అధికలాభాలు గడించేందుకు వీరు ఈ పనిచేసినట్లు ఆయన తెలిపారు. దాడి చేసి పట్టుకున్న ఈపూరు సెబ్ పోలీసులను అడిషనల్ ఎస్పీ అభినందించారు.

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు

చిలకలూరిపేట టౌన్: యువత వ్యసనాలకు బానిసై తమ భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని డాక్టర్ సయ్యద్ అహమ్మద్ బాష చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వాసవీ గ్రాండ్ ఫంక్షన్ హాలులో సేవ్‌ది యూత్– సేవ్‌ది ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ మానసిక వైద్యుడు అహమ్మద్ బాష మాట్లాడుతూ సోషల్ మీడియాతో విద్యార్థులు ఎక్కువ సమయం గడుపుతున్నారని, ఇందువల్ల వాస్తవ ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఉటంకిస్తూ ఉక్కులాంటి నరాలు, వజ్రము లాంటి సంకల్పం కలిగిన యువత మన దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు బలమైన సంకల్పంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజరీ కమిటీ సభ్యులు మానం శ్రీనివాసరావు, మెడరస్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్, సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, డాక్టర్ అశ్వని, డాక్టర్ ఇందిరా, సంధ్య, నారాయణమూర్తి పాల్గొన్నారు.